


# చెలమ

—కాట్రగడ్డ దయానంద్

పడమర గాలి 'బొయ్యి'మంటూ వాళ్ల ఒంటిని చుర్రుమని కాలుస్తోంది. వీస్తున్న మంటల గాలి వాళ్ల ముక్కుల్లో జొరబడి నానా బీభత్సం చేస్తూ శరీరాల మీది చెమటను క్షణాల మీద ఆవిరి చేసి ఉప్పును మిగిలిస్తోంది.

చుట్టూ దట్టంగా పెరిగిన జామాయిల్ చెట్లు....

మీద వలయాలు వలయాలుగా విస్తరిస్తూ ఇంతకుముందుకంటే ప్రచండంగా వెలిగిపోతున్న సూర్యుడు...

దాహమైన పిట్ట ఒకటి కిక్కిరి కిక్కిరి అంటూ వాళ్ల నెత్తిమీద గిరికీలు కొట్టి ఎటో వెళ్లిపోయింది.

వాళ్లు రాతి మనుషుల్లా కదుల్తున్నారు. గెడ్డపారల్తో మట్టిని తవ్వుతున్న వాళ్ళూ, సెలగ పారల్తో మట్టిని తట్టల్లో కెత్తి నెత్తిన కెత్తి బయట పోస్తున్న వాళ్లూ...

నాలుగు రోజుల్నుంచీ మట్టితోటే ప్రపంచం...

అంతా మట్టితోటే యుద్ధం... .

అందరి కళ్ళల్లోనూ నిరాశ, నిరుత్సాహం...

''అయ్యో! జల ఇంకా పడలేదే''నన్న దిగులు....

ఊరి మగవాళ్లందరూ అక్కడే వున్నారు. అయినా మునుపటి కంటే పట్టుదలగా తవ్వుతున్నారు వాళ్లు.

చలమయ్య నాయుడు గెడ్డపారకు ఖంగుమని రాయి తగిలింది. ఆయన చేతులు ఒక్కసారిగా జలదరించేయి. ఆయన ఒంటి మీది చెమట ధారలు వణికిపోయి కిందికి జారి మట్టిని తడిపేయి.

ఎక్కడి గెడ్డపారలు అక్కడే ఆగేయి. ఎక్కడి మనుషులు అక్కడే ఆగేరు.

నుదుటి మీద మిగిలిన చెమటను చూపుడు వేలితో విదిలిస్తూ చెలమలోంచి పైకి చూసేడు నాయుడు.

పై నుంచి ఏమిటన్నట్టు చూసేడు రామ్మూర్తి పంతులు.

నిశ్శబ్దాన్ని చీలుస్తూ దిగులుగా అన్నాడు నాయుడు ''పంతులూ! రాయి పడింది''

రామ్మూర్తి పంతులు చెలమలోకి దిగేడు. అందరూ తప్పుకుని దారిచ్చేరు.

''పంతులుగారూ! నిరుడి కంటే పదడుగులు లోతెక్కువ తవ్వినా జల రాలేదంటే నాకేందో అనుమానంగా ఉందయ్యా!'' అన్నాడు ఇశాకు.

పంతులు పై ఉత్తరీయాన్ని సరిచేసుకుని జామాయిల్ చెట్లవైపు చూపుడు వేలు విసుర్తూ,

''ఆనాడే చెప్పేను నాయుడూ! ఊళ్ళోకి ఇసపు జాతి మొక్కల్ని తేబాకండని! ఇయ్యాల అనుకుని ఏం లాభం? మొత్తం లోతట్టు జలనంతా పీల్చేసి అది చూడు పచ్చగా ఎంత మిసమిసలాడుతుందో! ఇయ్యాల చెలంలో నీళ్ళు పడమంటే ఏడ నుంచి పడతాయి చెప్పు?'' అడిగేడు పంతులు.

''ఏం చెయ్యమంటావయ్యా పంతులూ? నేనే తెచ్చానా ఈ చెట్లని? జిల్లా అంతటా రైతులు ఎగసాయం మానేసి సబుకు చెట్లో జామాయిల్ చెట్లో పెంచుతున్నారు చేలల్లో! ఏదో ఒకేడు ఎగసాయం చేసి నాలుగైదేళ్ళు కళ్ళు మూసుక్కూర్చుంటే నాలుగు డబ్బులు కళ్ళ చూడొచ్చని రైతుల ఆశ'' అన్నాడు నాయుడు.

పంతులు కోపానికీ కారణముంది. మునుపేమో రామ్మూర్తి పంతులు ఏమీ కొనుక్కోనవసరం లేకుండా ఏడాది పొడుగునా కావలసిన బియ్యం కాడి నుంచి పప్పులూ ఉప్పులూ దాక రైతులు చేలో పండిన కాడికి ఆయనింటికి పంపేవాళ్ళు. వ్యాపార పంటలొచ్చినాక ఆ ఆచారం పోయింది. ఇప్పుడు రైతులు తృణమో ఫణమో డబ్బే ఇస్తున్నారు. పంతులు అన్నీ బయట కొనుక్కోవాల్సొస్తుంది. అసలే ఆరుగురు కొడుకులూ, కోడళ్ళూ, వాళ్ళ పిల్లలూ.... ఈ పంటలొచ్చిన తర్వాత జరుగుబాటే కష్టమై పూర్తిగా చెలమయ్య నాయుడు మీదే ఆధారపడాల్సొచ్చింది. ''ఇంతమంది పిల్లల్ని ఎందుకు కన్నానా'' అని అప్పుడప్పుడూ ఈమధ్య రామ్మూర్తి పంతులు విచారించడం మామూలైంది.

అన్నీ గుర్తొచ్చి రామ్మూర్తి పంతులు అన్నాడు.

''కలికాలం కాపోతే తిండిగింజలు పండియ్యడం మానేసి ఏమంటా పుగాకు పత్తీ వేసేరోగాని ఊర్లు ఊర్లలా వున్నాయా? రైతులు రైతుల్లా వున్నారా? బ్రహ్మంగారు చెప్పింది ఊరకే పోతుందా?''

''సరె సరే! కాలగ్యానం ఆపి నీళ్ళ సంగతి చూడు పంతులూ!''

చెలమయ్య నాయుడు మాటలోని వెటకారం పంతుల్ని సూటిగా తాకింది.

ఊళ్ళో నుంచి సాకలి కోట్లింగం కావిడి మోసుకుంటూ వచ్చేడు. వాడి పెళ్ళామూ, కూతురూ, రెండు బిందెల నిండా నీళ్ళు మోసుకుంటూ వచ్చేరు.

కోట్లింగం చెలమలోకి తొంగి చూసి ''లెగండి! లెగండి! కూళ్ళు తాగినాక మొదులుపెడుదురుగానీ—'' అన్నాడు.

అందరూ పైకొచ్చేరు. చేతుల వరకూ శుభ్రంగా కడుక్కున్నారు. పంతులు ఒక చెట్టు నీడన సతికిలబడుతూ తనకు తెచ్చిన స్టీలు టిఫిను క్యారియరు విప్పేడు.

మిగిలిన వాళ్ళు అందరూ వరుసగా కూర్చున్నారు. అందరికీ కొంచెం ఎడంగా ఇసాకూ, వాడి కొడుకులిద్దరూ కూర్చున్నారు. కోట్లింగం కూతురు చింతకాయ పచ్చడి కలిపిన జొన్న సంకటి ముద్దల్ని మొదట చలమయ్య నాయుడికీ, తరువాత మిగిలిన వాళ్ళకూ అందించింది. అది తిన్నాక కోట్లింగం కుండ ఎత్తి మజ్జిగ కలిపిన సంకటి నీళ్ళను అందరి దోసిళ్ళలోనూ పోసేడు. అన్నాలు తాగేసరికి పొద్దు నెత్తిమీద నుంచి పడమరకు వాలింది.

> మంచినీటి చెరువులో గొడ్డు దిగితే రాని దోషం మనిషి దిగితే వస్తుందా? ఈ ప్రశ్న తండ్రి వేశాడు కానీ అది జవాబు కోరని ఆత్మ ఘోష. జవాబు చెప్పలేని ప్రశ్న వేసింది కొడుకులు!
>
> గొడ్డు కన్నా మనిషిలో 'మైల'ను చూసే మనుషులు గొడ్డు రక్తం కలిసిన నీళ్ళు తాగ డానికేం?
>
> 'రక్తం' పనికొచ్చినప్పుడు ఆ రక్తం వున్న మనిషెందుకు పనికి రాలేదు?

''ఒరేయ్! నీళ్ళు జాగ్రత్తగా వాడండ్రా!'' అన్నాడు నాయుడు.

''ఏం నీళ్ళో ఏమో కాపా! ఇంకో రెండ్రోజులు పోతే ఈ కాసిని బురద నీళ్ళక్కూడా గతి ఉండేట్టు లేదు. సెలంలో నీళ్ళు పడకపోతే బర్రె గొడ్ల గతే మనకూ పట్టేట్టుంది'' గడ్డాన్ని గోక్కుంటూ అన్నాడు ఇసాకు.

నాయుడు ఏమీ మాట్లాడకుండా ఆలోచనలో మునిగేడు.

ఇసాకు దిగులుగా దగ్గి ''ఒక పుగాక్కాడ ఇయ్యండే!'' అన్నాడు తల గుడ్డ తీసి విదిలిస్తూ.

చలమయ్య నాయుడు బాడీ జేబులో నుంచి ప్లాస్టిక్ సంచి తీసి ఒక నాసిరకం పుగాకుకాడ ఏరి ఇసాకు మీదికి విసిరేడు. ఆనందంగా అందుకుని పెదాల మధ్య కాడ వుంచి ''బ్బబ్బబ్బ'' అంటూ వాసన చూసేడు ఇసాకు. తనో మంచి కాడ తీసుకుని చుట్ట చుట్టడం మొదలుపెట్టేడు నాయుడు.

అందరూ పై కండువాలు పరుచుకుని చెట్ల నీడన ఒరిగేరు. నాయుడూ, పంతులూ దూరంగా నున్న వేప చెట్టు కిందికి చేరేరు. కోట్లింగం, వాడి పెళ్ళామూ, కూతురూ ఊరి దారి పట్టేరు.

ఊళ్ళో నుంచి పిల్లలు చేస్తున్న అల్లరి గాల్లో తేలి వస్తోంది. గాలి కదిలినప్పుడల్లా ఏదో పిట్టల గొంతులు ఎక్కడో దూరాన్నుంచి వినబడీ వినబడనట్టు చెవుల్లో కువకువలాడుతున్నాయి. కింద పడ్డ అన్నాన్ని కాకులు ఏరుకుతింటుంటే వాటిని తరుముతూ రెండు కుక్కలు నీళ్ళ పడి నానిన మట్టిని వాసన చూస్తున్నాయి.

నాయుడు చాలాసేపు శూన్యంలోకి చూసి లోగొంతుకతో పంతులుతో అన్నాడు.

''పంతులూ! చెలమ తవ్వడానికి అద్భుతమైన ముహూర్తం పెట్టినానన్నావ్! ఈసారి ఈశాన్యం నుంచి తవ్వడం మొదలెడితే నీళ్ళ ఇదివరకటి కంటే ముందే ఊరతాయని లెక్కలు కట్టి చెప్పేవ్! నాలుగు రోజుల్నుంచీ తవ్వడమే గాని బొట్టు నీళ్ళన్నా గెడ్డపారకు తగల్లేదు గదయ్యా! పరిస్థితి చూస్తుంటే కట్టు గొయ్యల్నించి దేశమ్మీదికి గొడ్లను వదిలినట్టు కట్టుగుడ్డల్తో మనం కూడా ఊరిడిసి పోవాల్సొచ్చేట్టుంది''.

రామ్మూర్తి పంతులు అదో రకంగా ముఖం పెట్టి ఒంటి మీది జంధ్యాన్ని తడుముకుని గొంతు సాధ్యమైనంత చిన్నగా చేసి,

''నాయుడు గారూ! శాస్త్రాలెన్ని తెలిసినా నేనూ మానవ మాత్రుణ్నేగా! మంత్రాలైతే చదవగలనేమోగాని లేని నీళ్ళను పుట్టించగలనా చెప్పు? ఆస్తి పాస్తుల్లేని చిల్లర జనమైతే దేశాల మీద పడి కూలి నాలి చేసుకు బతగ్గలరేమో గాని మన సంగతేంది? ఇంత బతుకూ బతికి ఇంటెనకాల చచ్చినట్టు ఇంత ఆస్తీ ఉంచుకుని ఊరిడిసిపోవడం మనతోనే మొదలయ్యేట్టుంది'' అన్నాడు.

''నేను నిన్నేమీ తప్పు పట్టడం లేదు పంతులూ, కాస్త తెలివి గల్లోడివి కదాని పరిష్కారం ఆలోచించమంటున్నా! మనిద్దరి కుటుంబాలకూ ఒక పీపాడు నీళ్ళు ఆరేడు మైళ్ళ నుంచ

పటిష్టమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్

యినా అగ్గురారం నుండి తెప్పించుకోవచ్చు. మిగిలిన వాళ్ళకు ఆశక్తి ఉండద్దూ? వాళ్ళందరూ మూటా ముల్లే సర్దుకుని ఊరు వదిలిన తర్వాత మనిద్దరం ఏం చెయ్యగలం చెప్పు? నాకిక ఒక్కటే దోవ కనబడుతుంది. ఈ ఎండాకాలమన్నాళ్ళూ వెళ్ళి ఎక్కడన్నా ఉండి మళ్ళీవానలు పడిం తర్వాత తిరిగి ఊళ్ళోకి రావడమే! అప్పుడైతే చెరువులోకి నీళ్ళొస్తాయి కదా!'' అన్నాడు నాయుడు మళ్ళీ మట్టను ముట్టేస్తూ.

ఆ మాటకు రామ్మూర్తి పంతులు ఉలిక్కిపడ్డాడు. నాయుడికైతే పట్నంలో ఇల్లుంది. వెళ్ళి అక్కడే ఉంటాడు. తన పరిస్థితేంది? గంపెడు సంసారం... ఈ ఊరు వదిల్తే పూట గడుస్తుందా తనకు... అందుకే అన్నాడు.

''ఊరు ఖాళీ చెయ్యడం శాస్త్రరీత్యా అరిష్టం నాయుడూ! ఒళ్ళు విరగ్గొట్టుకుని చెలంలో పడ్డ బండను పగలగొట్టడమే! దాని కింద జల ఉండకుండా పోదు. దానికి ఆఖరు ప్రయత్నంగా శాంతి జరిపిద్దాం! ఇన్ని పూజలు చేసినా నీళ్ళు పడలేదంటే నాకేందో అనుమానంగా ఉంది. ఆఖరుగా మనిషి నెత్తుటితోటి నేలను తడేపి మాద్దాం''

''అంటే... నరబలా?'' నాయుడు ఉలిక్కిపడ్డాడు.

''అటువంటిదే కానీ పూర్తిగా మనిషిని బలివ్వడం కాదు. మనిషిది ఏదో ఒక అవయవం, కాలో, చెయ్యో అదీ కాకపోతే వేతివేలో తెగ్గొట్టి గంగానమ్మకు అభిషేకం చెయ్యడం'' అన్నాడు పంతులు.

''వేతి వేలియ్యడానికి ఎవడు ముందు కొస్తాడు చెప్పు?'' అన్నాడు నాయుడు.

ఇద్దరూ ఆలోచనలో పడ్డారు.

చాలా సేపటి తర్వాత పంతులు అన్నాడు.

''నాకొక్కటే మార్గం తోస్తుంది. మన ఊళ్ళో నేనూ, సాకలి కోట్లింగమూ, మాదిగ ఇసాకూ తప్ప అందరూ మీ బంధువులే. వాళ్ళు ఇవ్వడానికి మీరొప్పుకోరు. ఇంటి సాకలి తోబుట్టుతో సమానమంటారు. వాడి నొదిలెయ్యి. మిగిలింది ఇసాకు. 'ఊరికోసం ఈ మాత్రం చెయ్యలేవా' అని అడుగుదాం? కాదూ కూడదంటే అయిదారెకరాలు ఆశ చూపిద్దాం వాడే వాలుకొస్తాడు'' అన్నాడు పంతులు.

నాయుడికీ ఈ ఆలోచన నచ్చింది.

'' ఈ పూటకు పనిసారిచ్చి రాత్రికి మాట్లాడదాం'' అన్నాడు నాయుడు.

ఆ ఊరికింకా కరెంటు రాలేదు. ఉన్నవే ముప్పై ఇల్లు. ఎండాకాలం నీళ్ళ సమస్యతో ఎడారిదేశంలా ఉంటుంది ఆ ఊరు. పంచాయతీ ఎన్నికల్లో ఓట్ల కోసం అగ్గురారం నుంచి ఎంత మంది వచ్చినా వాళ్ళు ముందు చెప్పేది ఆ ఊరి నీళ్ల కోసం పైపు లైను గురించే! ఆ ఊరి పరిసరాల్లో ఎంత తవ్వినా పడేది ఉప్పు నీళ్ళే! అందుకే ఊరికి చాలా దూరానున్న నాయుడి చేలో చెలమ తవ్వి చాలా ఏళ్ళ నుంచి ఎండాకాలం నీళ్ళు తెచ్చుకునే వాళ్ళు. ఈ సంవత్సరం ఆ చెలమ కూడా కరుణించేట్టు లేదు.

అందరూ రావిచెట్టుకిందికి చేరేరు. నాయుడు చెప్పవలసిందేదో చెప్పేడు. పంతులు చదవవలసిందేదో చదివేడు. ఇప్పుడు అందరూ ఇసాకునే చూస్తున్నారు.

''అయ్యా! ఏడనో ఉత్తరాదిన అక్కడ తినార్సి నోన్ని తీసుకొచ్చినీ ఇంట్లో జీతానికుంచుకుని నాకో దారి చూపిచ్చేవు. గవర్మెంటోడికి చెప్పి సవుడో పోరంబోకో నీకు తోచిన కాడికి నాలుగెకరాలిప్పిచ్చేవు. ఇయ్యాల నా ఏలు తెగ్గొట్టేత్తే అయిదెకరాలు బెమ్మాండమైన భూమి ఇప్పిత్తానంటున్నావ్! నువ్వు అగ్నాపించాల్నే గాని ఈ ఒంటిని కోసియ్య నంటయ్యా!'' అన్నాడు.

నాయుడు కళ్ళల్లో గర్వం కన్పించింది. 'మాచావా' అన్నట్టు పంతుల్ని చూచి మీసం మెలేశాడు.

''ఒరే అయ్యా!'' అంటూ ముందుకొచ్చేరు ఇసాకు నలుగురు కొడుకులూ

''అయితే బాబూ! నిన్నో వరం అడుగుతానయ్యా'' ఇసాకు ఆగేడు.

''అడగరా! నీళ్ళొస్తయ్యంటే ఏమడిగినా సరే'' అన్నాడు నాయుడు.

ఇసాకుపంతులు గారి వైపు తిరిగి దణ్ణం పెట్టి ''ఊరన్నాక కట్టుబాటుండాలంటాడు మన పంతులు. ఈ ఊళ్ళో నాదొక్కటే మాదిగ కుటుంబం. పూట పూటకూ తొట్టెడునీళ్ళు కావాలి మాకు. ఎవురో ఒకరు దయగలోల్లు నీళ్ళు ముంచి ఒడ్డునున్న మాకు పోసిందాకా ఎదురుచూడాల్సిందే కదా! ఇంకా బెట్ట రోజుల్లో నైతే చెలమకాడ ఊళ్ళోనుంచి మళ్ళీ మని షొచ్చిందాకా అగచాట్లు తప్పవు కదా నాయనా! గొడ్డు చెరువులోకి దిగి నీళ్ళు తాగితే తప్పులేనప్పుడు మాదిగోడు చెరువులోకి దిగడంలో తప్పేందని? మన చుట్టూ ఊళ్ళల్లో ఊర చెరువుల్లోంచి నీళ్ళు మాదిగోళ్ళు ముంచుకుపోతున్నారు. మనూల్లో కూడా ఈ కట్టుబాటు తప్పిండయ్యా! నా వేలే కాదు. నా చెయ్యి నరికియ్యమన్నా ఇస్తాను.'' చివరి మాటలు గబగబా అని నాయుడు మొహంలోకి చూచేడు ఇసాకు. అదెంత పనన్నట్టు నాయుడు రామ్మూర్తి పంతులు మొహంలోకి చూచి ఉలిక్కిపడ్డాడు.

రామ్మూర్తి పంతులు లేచి నుంచుని జేబులో నుంచి కళ్ళ జోడు తీసుకుని పెట్టుకున్నాడు.

''నిజమే! అన్ని ఊళ్ళూ కట్టుబాట్లు తప్పేయి. ఆ ఊరికీ మనూరికీ తేడా తెలీడం లేదు మనకు. ఏ ఊర్లో చూచినా నిద్ర లేచేసరికి కొట్టుకు చావడమో, పార్టీల పేరుతో నట్టనడిమికి చీలడమో జరుగుతున్నాయి. ఇవ్వాల ఇదవుద్ది. రేపు చలమయ్య నాయుడికి పోటీగా ఇంకోడు పుట్టొచ్చు. అప్పుడు మనూరు రావణ కాష్టంలా తయారవుద్ది. కట్టుబాటు తప్పింతర్వాత ఊళ్ళో వుంటే ఏంది? వల్ల కాట్లో వుంటే ఏంది? ''. తీవ్రంగా అన్నాడు రామ్మూర్తి పంతులు.

ఆ మాటలకు నాయుడు తన పెత్తనం పోతుందేమోనని భయపడి ''నిజమే! నిజమే' అన్నాడు.

''అయితే ఇంతకీ సెలమ సంగతెట్టా?'' ఎవరో పెద్దగానే అన్నారు. రామ్మూర్తి పంతులు అటు చూచి చీకట్లో ఎవరో పోల్చుకోలేక పోయాడు.

'ఇంకేముందిరా! ఊరు ఖాళీ చేసి పోవాల్సిందేన్రా!'' అన్నాడు చలమయ్యనాయుడు.

అప్పుడు ఇసాకు లేచి నుంచుని తలగుడ్డ చుట్టుకుని ముందుచలమయ్య నాయుడినీ ఆ తర్వాత జనాన్నీ చూచి,

''నాయుడుగోరూ! జలపడటానికి మాదిగోడి నెత్తురు పనికొచ్చుద్దంటే అట్టనే నెత్తురు ఇత్తానయ్యా! మనమూ, మన పిల్లా పాపలూ కలికాలం ఈ మట్టిని నమ్ముకుంటానంటే అట్టాగే నా ఏలు తెగొట్టి ఇత్తనయ్యా! అయితే బాబూ! నాకు మడులొద్దూ మాన్యాలొద్దూ నాయనా? ఆస్తి కోసం మాదిగ ఇసాగ్గాడు ఒళ్ళమ్ముకున్నాడని అపకీర్తి నాకొద్దు బాబూ!'' అని పంతులు వైపు చూచి

## అందుకే...

''అబ్బ! మీ ఇల్లెంత నీట్‌గా వుందోయ్! నిజంగా నీ భార్యను అభినందించాల్సిందే!''

''ఏడ్చినట్లుంది! ఇల్లంతా సర్దేది నేనే''

''అదే! అందుకే మీ భార్యను అభినందించాలి''

— ఆర్. మురళి, హిందూపురం

"పంతులుగోరూ! మీ ఇట్ట ప్రకారమే ముహూర్తం పెట్టండయ్యా!" అన్నాడు.

"ఒరే అయ్యా!"అంటూ ఓబయ్య ఇసాకును చేరేడు. వాడి వెనకే వాడి తమ్ములూ చేరేరు.

"ఎంత పని చేసేవురా, అయ్యా!" అన్నాడు ఓబయ్య మళ్ళీ.

ఇసాకు వాడి భుజమ్మీద చెయ్యేసి చెట్టు నీడ నుంచి వెన్నెల్లోకి నడిపించి ఇంటెదారి పట్టేరు.

"ఓబాయి! కడుపుచేత్తో పట్టుకుని ఈ ఊరొచ్చేన్రా! ఈ ఊళ్ళోకి సాకలోళ్ళు రాక ముందు ఊరి గుడ్డలన్నీ ఉతికి పెట్టేను. ఊరందరికీ చెప్పులు కుట్టుకుని బతికేను. ఇయ్యాల మనకంటూ ఓ గుడిసె, నాలుగెకరాల పొలమూ, నలుగురు కలిగిన సంసారమూ ఈడనే గదా వుంది. నీళ్ళు లేకపోతే ఇయ్యాల మనందరమూ కడుపు చేత్తో పట్టుకుని ఇంకో ఊరు వెతుక్కోవాల్సిందేగా! అదీగాక నేనొప్పుకోకపోతే ఊరందరూ మనతో ఎట్టుంటారో ఆలోచించు. ఊరిడిసి పెట్టాక ఇంకో ఊళ్ళోనైనా నలుగురికీ సేవలు చేసుకుని బతకాల్సిందేగా? అందుకే ఒప్పుకున్నాన్రా!" అన్నాడు ఇసాకు కొడుకుతో

మరుసటి రోజు రాత్రి ఎక్కడో ఊరికి ఖూడు మైళ్ళ దూరానున్న చెలమ వద్ద హడావిడిగాను, ఆనందంగానూ అమ్మవారికి కొలువుల జరిగినంత సంబరంగానూ వుంది.

ఇసాకుకు తలస్నానం చేయించేరు. వాడు పూర్తిగా కూలబడేట్టు సారా తాగించేరు. వాడి మొల మీద గుడ్డ తప్ప మరే ఆచ్ఛాదన లేదు.

రామ్మూర్తి పంతులు పసుపుతోముగ్గు గీసాడు. అందులో ఇసాకును కూర్చోబెట్టేరు. సెలమ మట్టూ తిరిగి పసుపు కుంకుమలు వెద జల్లేడు. మంత్రాలు ఉచ్చరించేడు. ఇసాకు కళ్ళకు గంతలు కట్టేరు. అగ్గురోరంలో అమ్మోరి జాతరకు దున్నపోతు తల నరికే వెట్టోడు రోశయ్య అమాంతం కత్తినెత్తి ఇసాకు బొటనవేలు నరికేడు. పెడబొబ్బ పెట్టేడు ఇసాకు. భూమ్యా కాశాలు ముద్దాడుకునే అంచుల్దాకా మోగింది ఆ కేక. కీచురాళ్ళ రొద ఆగింది. చూస్తున్న జనం నోళ్ళు తెరిచేరు. ఇసాకు చేతి వేలుతెగి అల్లంత దూరాన పడింది. తెగిన దగ్గర రక్తం చివ్వున చిమ్మింది.

"నాయనా!" అంటూ దిక్కులు పగిలేలా ఏడ్చేడు ఓబయ్య. అప్పుడు జనంలో కదలి కొచ్చింది. రోశయ్య అన్నం మెతుకుల్లో నెత్తురు

## వడగళ్ల వాన

కరవు కరవంచు గగ్గోలు పరువలేదు
త్రాగుటకు నీళ్ళు కరవయ్యె దైవమా! వృ
షత్తు వానలేదన్న మా నెత్తి మీద
కసిగ కురియింతువటె! వడగండ్ల వాన

రాళ్ళు విసరుట మా బడి పిల్లల కడ
నేర్చుకొన్నావు కాబోలు! నీవు కూడ
రాలు రువ్వెదువే? జీవరాశి మీద
దాను నీ కన్న మా పిల్లలే-నయమ్ము

రవ్వలు గ్రాలు భాగ్యనగ
రమ్మును దాటిన వెన్క-అంత నీ
వృచ్చరమే కనంబడును
పల్లెల మండి కసాయివాడకున్
వచ్చెడి గోగణాల వయి
నమ్మెల వస్త్రుజలమ్ము తక్క ఏం
కెచ్చట నీటి బొట్టు కనమే
మన రాయలసీమదారులన్

మూపక నాలుగేండ్ల కొక
మాటును సాగర తీరవాసులన్
వానల పేరితో సెను తు
ఫానుల నింపకు, ముంపకీ తెలం
గాణమునందు రాళ్ళ వడ
గళ్ళవి రువ్వకు, ఒక్క నిమ్న మా
త్రానకు నోచుకోని దవి
రాయలసీమ నెడారి చేయుకే!

—ఉత్పల సత్యనారాయణాచార్య

కలిపేడు. 'పాలి! పాలి!" అంటూ ఆ నెత్తురు చెలమ మట్టూ చల్లేడు.

"నాయుడూ! ఇక పని మొదలు పెట్టండి" అన్నాడు పంతులు.

చంద్రుడు నిశ్చలంగా నిలబడున్నాడు. అందరూ గెడ్డ పారలు తీసుకుని ఒకళ్ళ వెనక ఒకళ్ళు భయంగా సెలమలోకి దిగేరు.

ఖంగు ఖంగున ఆ రాత్రంతా బండను పగల గొడుతూనే వున్నారు వాళ్ళు. తెల్లారే సరికి బండ ఒక పక్క పూర్తిగా పగిలి గెడ్డపారలకు ఎర్రటి మొరం మట్టి మెత్తగా తగిలింది. చివ్వున బండ అడుగు నుంచి నీళ్ళుచిమ్మేయి. నాయుడు నీళ్ళు తాగి చూచి "ఒరేయ్! అమృతంరా, అమృతం!" అంటూ అరిచేడు. కాస్సేపటికే మోకాలి లోతు నీళ్ళూరేయి.

సూర్యుడొచ్చేసరికి ఆ వార్త ఊళ్ళోకి చేరింది. బండ అడుగున తప్పకుండా జల వుండాలనే రామ్మూర్తి పంతులు విశ్వాసం నిజమైంది.

* * *

ఎండలు ముదిరేయి. ఆ ఊరికి ఎండాకాలం నీళ్ళ కరువు తీరిపోయింది. ఎన్ని ముంచుకున్నా నీళ్ళు తరగడం లేదు. కట్టు గొయల్నించి దేశమ్మీదికి చేరిన గొడ్లు మళ్ళీ ఇళ్లకు నడిచేయి. ఓబయ్య కావిడి నీళ్ళ కోసం చెలమకు వెళ్ళి ఎవరి కోసమన్నా ఎదురు చూడడం తప్పడం లేదు. వాళ్ళు నీళ్ళు ముంచి పోసిందాకా అక్కడే కూర్చోక తప్పడం లేదు. వాడికి రోజంతా నీళ్ళతోనే సరిపోతుంది.

* * *

నడి వేసవి కాలం ఒకరోజు పొద్దుటి పూట ఆ వార్త ఊరుని ఊపేసింది.

తల్లులు పిల్లల్ని అటు వెళ్ళకుండా ఆపేరు. మగవాళ్ళు అందరూ పరుగెత్తి చెలమ కాడికి చేరుకున్నారు. ఎవరూ లోపలకు దిగడానికి సాహసించడం లేదు.

రామ్మూర్తి పంతులు చెలమలోకి తొంగి చూచి "శివ శివా!" అంటూ కళ్ళు మూసుకున్నాడు.

ఆ నీరెండలో మిల మిలలాడాల్సిన చెలమంతా బీభత్సంగా వుంది.

నీళ్ళ మీద ఎర్రటి నెత్తుటి తెట్టు తేలుతోంది. నీళ్ళ మధ్యలో చలమయ్య నాయుడి దున్నపోతు తల తేలుతోంది. ఒక పక్కన ముక్కలు ముక్కలైన కాళ్ళూ, ఇంకో పక్క తలలేని తోలు వలిచిన మొండెమూ నీళ్ళ మీద అడ్డదిడ్డంగా పడుంది. నెత్తురింకా నల్లబడ లేదు. నల్లటి దున్నపోతు తలా, తెగిపడ్డ తెల్లటి కండలూ, ఎర్రటి నెత్తురుతెమడలతో నిండి పోయి చెలమ అంతా బీభత్సంగా వుంది. జనంలో నుంచి లోపలకు తొంగి చూచిన ఇసాకుకు ఓబయ్యా వాడి తమ్ముడూ మొండోడూ ఇంట్లో లేకపోవడం గుర్తొచ్చి వణికిపోయేడు.

"అమ్మో! మరి నీళ్ళో!" అందరి మనసుల్లోనూ ఇదే ఆందోళన ...

ప్రతిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్